క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ


జగనన్న గోరు ముద్ద పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నక్కపల్లి : మండలంలో బోదిగల్లం పాఠశాలలో మంగళవారం జగనన్న గోరు ముద్ద పథకాన్ని ఎంఈవో కుంచం నరేష్ తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పెట్టే ఆహారం నాణ్యంగా ఉండాలన్నారు. విద్యార్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆహార పదార్థాలు తయారుచేసే ప్రాంతాల్లో కూడా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచార్యులు, కుమారి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సత్కారం

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్థానిక నాయకులు యేజర్ల నవీన్ రాజు మంగళవారం సత్కరించారు. గ్రామీణ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు తమ గ్రామం పేరును తీసుకువెళ్లడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను దుస్సాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రథమ వార్షికోత్సవం

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కీశసకుర్తి అప్పారావు, ప్రధాన కార్యదర్శి గోవిందరావు, కోశాధికారి సతీష్, కార్యదర్శి ముచ్చపల్లి నాగేశ్వరరావు, మండల సంఘం అధ్యక్షుడు దక్షిణేశ్వరరావు, కోశాధికారి శంకర్‌రావు, కార్యదర్శి జొన్నాడ సతీష్, కొడమంచిలి అప్పారావు, సరిపల్లి సోము, చల్లపల్లి అచ్యుతరావు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామ సభలు

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండలంలోని పాటిపల్లి, నారాయుడిపాలెం, చెర్లోపాలెం, రామగిరి గ్రామాల్లో మంగళవారం గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త పనుల గుర్తింపు, వాటి అనుమతి కోసం కలెక్టర్‌కు పంపించనున్నట్టు అధికారులు తెలిపారు.

అపర చాణక్యుడు పటేల్


పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం బీజేపీ కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ యలమంచిలి నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ అపర చాణక్యంతో రాజరిక సంస్థానాలను భారత దేశంలో విలీనం చేశారని తెలిపారు. భారత దేశ ఉక్కు మనిషి పటేల్ అని తెలిపారు. రాజాన రాజు, మేరుగు కాసుబాబు, యండపల్లి రాజు, బండారు కన్నంనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ పట్టణ పరిధిలో రహదారుల అభివృద్ధిలో భాగంగా విద్యుత్ స్తంభాలను దశలవారీగా తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం డి–1 సెక్షన్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పూడిమడక రహదారి నుంచి చవితినవీధి, ఎన్టీఆర్ క్రీడా మైదానం, రైల్వేస్టేషన్ రహదారి, నర్సింగరావుపేట, వేల్పులవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నా రు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం

పాయకరావుపేట : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు, నిరుపేదలకు కూడా మెరుగైన వైద్యం కల్పించడం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో గల సత్యవరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన చిక్కాల రామారావు మాట్లాడుతూ శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారికి నెట్‌వర్క్ ఆసుపత్రిలో వైద్యం చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన 500 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ వీర అనుష్క, డాక్టర్ ఇషాక్ మహ్మద్, డాక్టర్ గణేష్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మాసాహెబుపేట, గోపాలపట్నం, సత్యవరం సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు బాబ్జి, నకిలేటి రాము, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి

ఎస్.రాయవరం : జగనన్న ఆరోగ్య సురక్షలో వేల రూపాయల ఖరీదైన వైద్యం ఉచితంగా చేయించుకోవచ్చని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెదగుమ్ములూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని రోగులతో ముచ్చటించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీపీ పరీక్ష నిర్వహించుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన కళ్లద్దాలు విద్యార్థులకు అందజేశారు. అంతకు ముందు ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులను పలకరించారు. ఈ వైద్యశిబిరంలో 382 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 10 మందిని ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు తరలించినట్టు చెప్పారు. కంటి రోగులను పరీక్షించి 127 మందికి కళ్లద్దాలు అందజేశారు. 23 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సకు తరలించారు. స్త్రీ వైద్య నిపుణులు జయలక్ష్మి, సాధారణ వైద్య నిపుణులు రాజేశ్వరి, యశ్విని కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మణిరాజు, వెలగా శ్రీనివాసరావు, సీతారామరాజు ,మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు పాల్గొన్నారు.


బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు

ఆరోగ్య సురక్ష శిబిరాలకు మంచి స్పందన

కోటవురట్ల : పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. పి.కె.పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, సర్పంచ్ బెన్నయ్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. మండలంలో 18 వైద్యశిబిరాలు నిర్వహించగా 6,139 మంది రోగులు వైద్య సేవలు పొందినట్టు తెలిపారు. ఈ శిబిరంలో 335 మంది రోగులను ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షించారు. 95 మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకోగా 48 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్టు గుర్తించారు. ఈ శిబిరంలో మాజీ సర్పంచ్ ఆర్.వెంకటరమణ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు, ఈసీజీ చేయించుకుంటున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు


విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న దృశ్యం


పి.కె.పల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు, సేవలు పరిశీలిస్తున్న నాయకులు

డిసెంబరు 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్వో మనోరమ సమావేశం


రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి మనోరమ

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : ఓటరు సవరణ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే వచ్చే డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె మనోరమ తెలిపారు. మంగళవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియపై వారితో చర్చించారు. ఇటీవల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా స్థానిక రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన ఆమె పార్టీల నాయకులందర్నీ పరిచయం చేసుకున్నారు. నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం పెరిగిందని చెప్పారు. గతంలో నియోజకవర్గంలో 245 పోలింగ్ కేంద్రాలుండగా ముసాయిదా జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రాలు 246కు పెరిగాయన్నారు. ముసాయిదా జాబితాలు అన్ని రాజకీయపార్టీలకు అందుబాటులో ఉంచామన్నారు. పరిశీలించి అభ్యంతరాలు, ఫిర్యాదులుంటే తమకు తెలియజేయాలని కోరారు. ఓటరు జాబితాలను అన్ని పోలింగ్ కేంద్రాల్లోని ప్రదర్శించినట్టు తెలిపారు. తాజా ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,02,732 కాగా అందులో పురుషులు 98,975, మహిళలు 1,03,742, ఇతరులు 15 మంది ఉన్నట్టు ఈఆర్వో రాజకీయపార్టీల నాయకులకు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రాచారి, దూది నర్సింహమూర్తి, ఆడారి రమణబాబు, సోమునాయుడు సహా పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మూలకు చేరిన వాహనాలకు తక్షణ మరమ్మతులు


మున్సిపల్ గ్యారేజ్ దగ్గర వాహనాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పురపాలక సంఘంలో మూలకు చేరిన పారిశుధ్య, ఇతర వాహనాలకు తక్షణమే మరమ్మతు పనులు చేయించాలని చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ గ్యారేజ్‌ను ఆమె పరిశీలించారు. తుప్పుపట్టిన, మూలకు చేరిన పలు వాహనాల పరిస్థితిని వాకబు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో తరచుగా వినియోగించే బాబ్‌కార్ట్ మరమ్మతు పనులను పరిశీలించి, విడిభాగాలు, ఖర్చు గురించి ఆరా తీశారు. మరమ్మతకు వచ్చిన 30 తోపుడు బళ్లను కూడా తిరిగి వినియోగంలోకి తేవాలని అధికారులకు సూచించారు. అలాగే మహాప్రస్థానం వాహనం నిర్వహణ కౌన్సిల్ తీర్మానానికి లోబడి ఉండాలన్నారు. ఇప్పటి వరకూ 12 మందికి వాహనాన్ని ఇచ్చామన్నారు. ఎవరైనా నిరుపేదలకు వాహనం అవసరమైతే తమ దృష్టికి తెచ్చి ఉచితంగా వాహనాన్ని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసవారావుకు చెప్పారు. త్రిమూర్తులు స్వామి గుడి వద్ద ఉన్న సన్యాసమ్మ చెరువును అందమైన పార్కుగా తీర్చిదిద్దడానికి విశాఖ డెయిరీ నుంచి నిధులను ఖర్చు చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, కోఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి ఉన్నారు.

కార్మిక పోరాటాలకు కేంద్ర బిందువు ఏఐటీయూసీ


యలమంచిలిలో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకల్లో మున్సిపల్ కార్మికులు


మునగపాక మండలం నాగులాపల్లిలో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

యలమంచిలి : పట్టణంలో మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసి అని పేర్కొంటూ ఎంతో మంది దేశ నాయకులు ఏఐటీయూసీకి నాయకత్వం వహించి కార్మిక వర్గంలో స్ఫూర్తి నింపారని అన్నారు. దేశంలో కార్మిక పోరాటాలకు కేంద్రబిందువై సమస్యల పరిష్కారంలో దశాబ్దాలుగా ఏఐటీయూసీ అలుపెరగని పోరాటాలు చేస్తోందని అన్నారు. అంతకు ముందు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యాక్రమంలో యూనియన్ నాయకులు వై.నూకరాజు, సిహెచ్ వెంకటరమణ, డి.మహేష్, ఈ.చంద్రరావు, కె.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

నాగులాపల్లిలో...

మునగపాక(అనకాపల్లి): మునగపాక మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని మల్లికార్జునరావు, వరహాలు పతాకాన్ని ఆవిష్కరించారు. శివ, జగదీశ్,ప్రసాద్, నూకరాజు, లక్ష్మి,నూకరత్నం తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలోనూ ఏఐటీయూసీ వేడుకలు నిర్వహించారు. డొక్కా పరదేశి, ముమ్మిడి ఈశ్వరరావు, నూక అప్పారావు, డొక్కా సూరి అప్పారావు, కామరాజు, రామచంద్రరావు, గాంధీ అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేతకు కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శిరీష శ్రీను బాబు, నాగరాజు

రాంబిల్లి : వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా నేవల్‌బేస్ వరకు గల రోడ్డుపై ఏర్పడ్డ గోతులను పూడ్చాలని ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కోరారు. ఈ మేరకు హరిపురంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నేవీ ఆధీనంలో వున్న ఈ రోడ్డుపై చాలా చోట్ల గోతులు పడ్డాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. నేవీ అధికారులతో మాట్లాడి గోతులను పూడ్చివేసేందుకు తప్పనిసరిగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పౌరహక్కులు సద్వినియోగం చేసుకోవాలి

నక్కపల్లి : రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అంబేద్కర్ కోరారు. మంగళవారం నక్కపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులు సమాజంలో నిర్భయంగా జీవించేందుకు రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందన్నారు. వీటిలో ప్రధానమైనవి విద్య, వైద్యం, ఉద్యోగం, నివసించేందుకు ఇల్లు, కనీస సదుపాయాలు పొందడం వంటి సదుపాయాలున్నాయన్నారు. వాక్ స్వాతంత్ర్యం, స్వేచ్ఛగా జీవించే హక్కు, ఓటు వినియోగించుకునే హక్కులు కూడా ఉన్నాయన్నారు. పౌర హక్కుల్లో రిజర్వేషన్లు కూడా ఒక భాగమన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలంటే ముఖ్యంగా అక్షరాస్యులు కావాలన్నారు. ప్రతి పౌరుడికి నిర్బంధ ఉచిత విద్య అందజేయడం జరుగుతోందన్నారు. కొంతమంది తమ హక్కులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులనే ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నాయన్నారు. న్యాయాన్ని సైతం ఉచితంగా పొందవచ్చన్నారు. సమావేశంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి రోటరీ వితరణ


సత్యనారాయణకు సహాయం అందిస్తున్న డా.సురేష్‌కుమార్, రోటరీ సభ్యులు

పాయకరావుపేట : తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డా.సురేష్‌కుమార్ సహకారంతో మంగవరం గ్రామంలో అంగవైకల్యంతో బాధపడుతున్న కొప్పాక సత్యనారాయణ అనే వ్యక్తికి జీవనాధారం నిమిత్తం రూ.25 వేలు ఖర్చుతో ఐరన్‌తో చేయించిన షాప్‌ను అందించారు. అదేవిధంగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపన్నులకు సహాయం చేయడంలో రోటరీ ఎల్లప్పుడూ ముందుంటుందని రోటరీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కె.ఎస్.ఎల్.ఎస్ వర్మ, కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ కె.గణేష్, సుబ్బరాయులు, చక్కా శ్రీనివాస్, నాగేశ్వరరావు, మంగరాజు, నాగభూషణం, డి.వి.రాజు, ఉమాశంకర్ సాయి, వివేక్, నర్సిబాబు, వీర్రాజు, డా. పి.ప్రసాద్, గౌరీ శంకర్, ఇతర రోటరీ సభ్యులు, మంగవరం ప్రెసిడెంట్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఘన నివాళులు


దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఇందిరకు నివాళులర్పించిన అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న శంకర్

యలమంచిలి : మండలంలో పేట బయ్యవరం యంపీయూపీ పాఠశాలలో మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి విద్యార్థులకు జాతీయ సమైక్యతపై వివరించి ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులు నవోదయ పాఠశాలల స్థాపన జాతీయ క్రీడలు నిర్వహణపై అవగాహన కల్పించారు. అంతకు ముందు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. అలాగే భారతరత్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలసి పూలమాల వేసి అంజలి ఘటించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పటేల్, ఇందిరా గాంధీ, జీవిత చరిత్రల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోడ్డేడ సత్యనారాయణ, పి.రవీంద్ర, కె.వీరభద్రరావు, ధన లక్ష్మి, కృష్ణా వేణు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు రూ.10వేలు ఆర్థిక సాయం


నక్కపల్లి : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని మంగళవారం నక్కపల్లిలో నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి మేడేటి శంకర్ ఆధ్వర్యంలో హాకీ క్రీడా మైదానంలో క్రీడాకారుల సమక్షంలో ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరా గాంధీ ఎంతో కృషి చేశారన్నారు. ఇందిర గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హాకీ క్రీడాకారులు పరికరాలు కొనుగోలు కోసం రూ.10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, గంగిశెట్టి గణేస్, వార్డు సభ్యులు నానాజీ, నీలి అశోక్ పాల్గొన్నారు.

అన్నమయ్య పార్కు అభివృద్ధికి చర్యలు


పార్కును పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి, జీవీఎంసీ అధికారులు

అనకాపల్లిటౌన్: స్థానిక అన్నమయ్యపార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. జీవీఎంసీ అధికారులతో కలిసి పార్కును మంగళవారం పరిశీలించారు. పార్కు అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సిమెంట్ బెంచీలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వివిధ రకాల పూలమొక్కలు, లైటింగ్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సందీప్, జీవీఎంసీ చీఫ్ ప్లానింగ్ అధికారి రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జి రమణ, హార్టికల్చర్ అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి


పట్టణంలో క్యాండిల్ ర్యాలీ చేస్తున్న సీఐ, ఎస్‌ఐలు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పట్టణంలో సర్కిల్ పోలీసులు క్యాండిల్ ర్యాలీ చేశారు. సీఐ షేక్ గఫూర్, యలమంచిలి టౌన్, రూరల్, రాంబిల్లి పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బంది ప్రధాన రహదారిపై పోలీసు అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహం కూడలి వద్ద మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గఫూర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులు, పోలీసు అధికారులను స్మరించుకోవడానికి ప్రతి ఏటా పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసులంతా తమ విధి నిర్వహణతో పాటు కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సన్నిబాబు, పాపినాయుడు, దీనబంధు, ఏఎస్‌ఐ వెంకట్రావు, పలువురు కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

జార్జిక్లబ్‌లో వైద్య శిబిరం నేడు

అనకాపల్లిటౌన్: జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కేవీ గౌరీపతి మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. విశాఖ సెవెన్‌హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో గుండె, కళ్లకు సంబంధించిన వైద్యులతోపాటు జనరల్ ఫిజీషియన్ వచ్చి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

నేడు చిన గుమ్ములూరులో ఆరోగ్య సురక్ష

ఎస్.రాయవరం : చినగుమ్ములూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. మండలంలో చివరిగా చినగుమ్ములూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

విద్యా సంస్థల బంద్‌పై గోడపత్రిక ఆవిష్కరణ

అనకాపల్లి రూరల్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఆక్షేపించారు. ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న దీక్షలు నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కరోనా సమయంలో కూడా దేశానికి సేవలందించిన ఘనత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.కన్నబాబు, వి.రాజు, పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయుడు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు


గౌరీపరమేశ్వరుల విగ్రహ ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల విగ్రహానికి ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు నిర్వహించా రు. అనంతరం పట్టణ వీధులగుండా ఊరేగించారు. పురవీధులమీదుగా సాగిన ఈ ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, సమితి సభ్యులు బుద్ద శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ, బుద్ద శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

అనకాపల్లి రూరల్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే ప్రాణభిక్ష పెట్టినవారవుతారని, రక్తదానంపై ఉన్న అపోహలను యువత విడనాడాలని అనకాపల్లి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఎంఏఎల్ కాలేజ్ సెంటర్లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద అమ్మ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో మొల్లి పరమేష్ మిత్రమండలి ఉచిత రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రత్నాకర్ శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రోజూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, ఆస్పత్రుల్లో చేరిన వారికి రక్తం అవసరమవుతోందన్నారు. అలాంటి వారికి రక్తదానం చేస్తే ఎంతో మేలు చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో కరణం కోటి, కరణం రామచంద్ర, కోరుమిల్లి కర్రి, నందవరపు కుమార్, మళ్ల రమణబాబు, దొడ్డి రమణ, త్రినాథ్, పవన్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.